క్లుప్తంగా

అన్నదానం



వృద్ధులకు ఆహారం వడ్డిస్తున్న ఈఓపీఆర్డీ

సిద్దవటం : సిద్దవటం–భాకరాపేట మార్గ మధ్యలో ఉన్న పరమాత్మ సేవా తపోవన వృద్ధాశ్రమంలో సోమవారం ఈఓపీఆర్డీ పులిరామ్‌సింగ్ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పులిరామ్‌సింగ్ కుటుంబ సభ్యులు, నేకనాపురం సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, బొగ్గిడివారిపల్లె ఉప సర్పంచ్ ఎల్లారెడ్డి, నరసింహారెడ్డి, ఉపాధి హామీ ఏపీఓ నరసింహులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

రాయచోటి టౌన్ : గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో ఇంటికే పరిమితమైన సహచర కార్పెంటర్ బాదుల్లాకు తోటి కార్పెంటర్‌ల మిత్రబృందం రూ.50 వేలు అందించారు. సోమవారం రాయచోటి పట్టణంలోని ఆయన ఇంటికి వెళ్లి ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకొని ఈ మొత్తాన్ని అందించారు. కార్యక్రమంలో కార్పెంటర్‌ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జిలాన్, ఉపాధ్యక్షులు మోహనాచారి, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటరమణ, కోశాధికారి మహమ్మద్ హుస్సేన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరబ్రహ్మాచారి, కార్యదర్శి ఎన్. నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలపై చట్టపరమైన చర్యలు

రాజంపేట : తమ చర్చి (హోరేబు ప్రార్థనమందిరం)లో ఎలాంటి అవతవకలు జరగలేదని చర్చిపెద్దలు పి.వసంతరావు, ఎస్.జయరాజులు సోమవారం పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలియజేశారు. కొందరు చర్చిలో అవతవకలు జరిగినట్లు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం అన్నారు. అధికారిక ఉత్తర్వులు కలిగిన తాము గత 15 సంవత్సరాలు నుంచి చర్చిని సక్రమంగా నిర్వహిస్తున్నామన్నారు. కమిటీ సభ్యులు ప్రతివారం వచ్చిన కానుకలను ఎప్పటికప్పుడు లెక్కించి, చర్చి అవసరాలు పోను మిగిలిన మొత్తం బ్యాంకులో డిపాజిట్ చేస్తున్నా న్నారు. లీగల్‌కమిటీ సభ్యులు అకౌంట్లను పరిశీలించారన్నారు. బయట వ్యక్తులు చర్చిపై ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అలానే ఆరోపణలు చేసిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటణలో పేర్కొన్నారు.

అర్జీలను పరిష్కరిస్తాం

ఓబులవారిపల్లె : రైతులు, ప్రజల సమస్యలు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీధర్ రావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వివిధ సమస్యలపై ప్రజలు, రైతులు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూములకు సంబంధించిన ఆన్‌లైన్, సర్వేకు సంబంధించి అర్జీలు వచ్చాయన్నారు. మండలానికి అదనంగా ఎనిమిది కొత్త రేషన్ షాపులు మంజూరునకు ప్రతిపాదనలు పంపామన్నారు. జనాభా ప్రాతిపదికన రేషన్ షాపులను పెంచుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామ్మోహన్ నాయుడు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

అడుగంటిన నీరు.. ఉబికిన కష్టాలు



దేవపట్లలో ద్విచక్రవాహనాల ద్వార నీటిని తెచ్చుకొంటున్న ప్రజలు

వర్షభావ పరిస్థితులు నెలకొనడంతో మండల వాసుల వాసులకు నీటి కష్టాలు మొదలయ్యాయి. మండల పరిధిలోని వివిధ గ్రామాలలో స్కీమ్ బోర్లలో భూగర్భ జలాలు అడుగంటాయి, దీంతో ప్రజలకు నీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పలు గ్రామాల్లో బోర్లు కాలిపోవడం , చెడిపోవడంతో ట్యాంకర్ల ద్వార ప్రజలు నీటిని పట్టుకుంటున్నారు. మరికొందరు సుదూర ప్రాంతాలకు ఆటోలు, ద్విచక్ర, ఇతర వాహనాలలో పొలాల వద్ద ఉన్న బోర్ల వద్దకు వెళ్లి బిందెలు, డ్రమ్ములతో నీటిని తెచ్చుకొంటున్నారు. ఏది ఏమైనా వేసవిని తలపిస్తున్న ఈ పరిస్థితుల్లో తాగునీటి ఎద్దడి ప్రజలకు భయాందోళనకు గురిచేస్తాంది. అధికారులు స్పందించి నీటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

– నంబేపల్లె



నీటికోసం కష్టాలు పడుతున్న బోయపల్లె గ్రామస్తులు

శివాలయంలో పూజలు



ప్రత్యేక అలంకరణలో శివలింగం

చిన్నమండెం : మండల కేంద్రంలో వెలసియున్న శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం కావడంతో స్వామి వారి మూలవిరాట్‌మూర్తిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారికి విశేష పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు



ఫణిరాజకుమారి, ఎంపీడీఓ, సిద్దవటం



శేఖర్‌నాయక్, ఈఓపీఆర్డీ, చిన్నమండెం



పి.జయశ్రీ, ఎంపీడీఓ, పుల్లంపేట

సిద్దవటం : మండల ఎంపీడీఓగా ఫణిరాజకుమారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేస్తున్న జవహర్‌బాబు గాలివీడు మండలానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో రాజంపేట ఎంపీడీఓగా పని చేస్తున్న ఫణిరాజకుమారి సిద్దవటానికి బదిలీపై వచ్చారు. ఆమె సోమావారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలియజేశారు.

చిన్నమండెం : చిన్నమండెం మండల ఈఓపీఆర్డీగా శేఖర్‌నాయక్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఉద్యోగుల సాధారణ బదిలీలలో భాగంగా ఆయన గాలివీడు మండలం నుంచి బదిలీపై చిన్నమండెంకు వచ్చారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

పుల్లంపేట : పుల్లంపేట ఎంపీడీఓగా సోమవారం పి.జయశ్రీ బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో వల్లూరు ఎంపీడీఓగా విధులు నిర్వహించేవారు. బదిలీలో భాగంగా సోమవారం పుల్లంపేట ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తామని, అలాగే పంచాయతీలోని పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామన్నారు.

రామాపురం ఈఓపీఆర్డీగా పట్నాయక్

రామాపురం : మండల పంచాయతీ విస్తీర్ణ అధికారిగా పట్నాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. లక్కిరెడ్డిపల్లె మండల ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఆయన మండలానికి వచ్చారు. మండలంలో పనిచేస్తున్న ఉషారాణి లక్కిరెడ్డిపల్లె ఈఓపీఆర్డీగా బదిలీ అయ్యారు.

దళితుల భూముల జోలికి వస్తే ఉద్యమం



విలేకరులతో మాట్లాడుతున్న సీహెచ్ చంద్రశేఖర్

రైల్వేకోడూరు అర్బన్ : చిట్వేలి మండలం తిమ్మాయగారిపల్లి దళితుల భూముల జోలికి వస్తే ఉద్యమాలు చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్, జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్యలు సోమవారం హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని దళితులు మొదటగా 1999 ఎన్నికల్లో తమ ఓటుహక్కు వినియోగించుకున్నారన్నారు. ఇందుకు టీడీపీ అగ్రవర్ణాల వారు దళితులపై కక్షగట్టి వారిని సాంఘిక బహిష్కరణ చేశారన్నారు. దీనిపై పోరాటం చేసి దళితులకు భూమి అందించాలని చేసిన డిమాండ్ దిగివచ్చిన ప్రభుత్వాలు చెరువు పోరంబోకు భూమిని దళితులకు ఇచ్చారన్నారు. దీన్ని జీర్ణించుకోలేని అగ్రవర్ణాల వారు ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి వచ్చాక భూమిని రద్దు చేయాలని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంపై మండిపడ్డారు. ఇరవై సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటున్న వారిని ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోమన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారావు, గురవయ్య, నరసింహులు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

భూములకు హద్దులు ఏర్పాటు చేయండి

పుల్లంపేట : మండలంలోని ఆర్.రాచపల్లి గ్రామంలో ఎస్సీలకు సంబంధించిన భూములకు హద్దులు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పండుగోల మణి, దళితులు సోమవారం తహసీల్దార్ అరవింద కిషోర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారికి పట్టాలు ఇచ్చిన భూములను వేరొకరు ఆక్రమించుకొని పంటలు సాగు చేసుకుంటున్నారని, విచారణ చేపట్టి న్యాయం చేయాలని వారు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

వెలుగు అవినీతిలో దళితుడిని బలిపశువు చేయొద్దు



మాజీ యానిమేటర్ యానాదయ్యను డ్వాక్రా సంఘం సభ్యులతో కలిసి విచారిస్తున్న సీపీఐ నేతలు

పెనగలూరు : మండలంలోని కట్టావారిపల్లె వెలుగులో జరిగిన అవినీతిపై దళితుడిని బలి చేయవద్దని సీపీఐ మండల కార్యదర్శి ఆదినారాయణ అన్నారు. సోమవారం కట్టావారిపల్లి పంచాయతీలోని దళితవాడలో జరిగిన అవినీతిపై సీపీఐ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ 2016వ సంవత్సరంలో ప్రభుదాస్ అనే సీసీ అవినీతి చేస్తే అక్కడ పనిచేసిన మాజీ యానిమేటర్ యానాదయ్య ఆ డబ్బు తిన్నట్టు అధికారులు అతన్ని బలి పశువు చేశారన్నారు. అప్పటి సీసీ ప్రభుదాస్ అవినీతికి పాల్పడ్డారని చెప్పారు. 2016వ సంవత్సరంలో అవినీతి జరిగితే యానాదయ్యపై ఒత్తిడి తెచ్చి రూ. 15 లక్షలు తీసుకురావాలని అనడం సబబు కాదన్నారు. కూలీపనికి వెళ్తేగానీ పొట్టనిండని యానాదయ్య రూ. 15 లక్షలు తెమ్మంటే ఎక్కడి నుంచి తీసుకువస్తారని వారు ప్రశ్నించారు. కావున వాస్తవ పరిస్థితిని అధికారులు పరిశీలించి మరోసారి ఆలోచించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి ఇ.లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులు రేవూరి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటు



విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయిస్తున్న సర్పంచ్

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని ఓబులవారిపల్లె, కటికంవారిపల్లె గ్రామాలలో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్ జయపాల్ రెడ్డి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భారతీ, వైఎస్సార్ పార్టీ నాయకులు సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హమాలీల కూలీలను పెంచండి



కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న హమాలీలు

రాయచోటి అర్బన్ : జిల్లాలోని పౌరసరఫరాల శాఖలో పనిచేసే హమాలీలకు వెంటనే కూలీ రేట్ల పెంపు జీఓను విడుదల చేసి, ప్రతి నెలా మొటి వారంలోనే జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట సివిల్ సప్లయ్స్ హమాలీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలకు కూలీరేట్లు పెంచుతూ ఇప్పటికే జీఓ ఇవ్వవలసి ఉండగా నేటివరకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు వారికి వెంటనే ఉద్యోగభద్రత కల్పించాలంటూ డిమాండ్ చేశారు. ప్రతి నెల మొదటి వారంలోనే జీతాలు చెల్లించాలంటూ కోరారు. అనంతరం ఈ మేరకు జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లానేతలు టి.ఎల్.వెంకటేష్, మురళీ, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య, అయూబ్‌బాషా, వీరాంజనేయులుతో పాటు పలువురు హమాలీలు పాల్గొన్నారు.

దారి సమస్య పరిష్కరించండి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న నరసింహారెడ్డి

వీరబల్లి : మండలంలో పెద్దివీడు పంచాయతీ, రూకావాండ్లపల్లికి చెందిన అవటాల నరసింహారెడ్డి తమ భూమి దగ్గర ఏర్పడిన రహదారి సమస్యను తీర్చాలంటూ స్థానిక తహసీల్దార్ శ్రావణికి సోమవారం ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన వెంకట ప్రసాద్‌రెడ్డి అనే వ్యక్తి తమ భూమిలో దారి వేయాలని ఉద్దేశంతో తమపై రౌడీయిజం చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. గత 30 సంవత్సరాలుగా తమ అనుభవంలో ఉన్న 10 సెంట్ల ప్రభుత్వ భూమిలో దారి ఇవ్వాలని బెదిరిస్తున్నాడని, తమ భూమి పక్కన పాతదారి ఉన్నప్పటికీ ఆ దారిన పోకుండా ఉద్దేశపూర్వకంగా కక్షసాధింపుతో గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ మహేశ్వర్‌రెడ్డికి అనుకూలంగా ఉంటూ మా భూమి చుట్టూ ఏర్పాటు చేసుకున్న రాళ్లకట్టను జేసీబీతో తొలగించాడని తహసీల్దార్‌కు తెలిపారు. దీంతో తహశీల్దార్ స్పందించి సంఘటనా స్థలాన్ని పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

‘యుద్ధాన్ని ఇజ్రాయిల్ వెంటనే ఆపాలి’



బస్టాండు సర్కిల్‌లో ధర్నా చేస్తున్న వామపక్షాలు

రాయచోటి అర్బన్ : పాలస్తీనా దేశంపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపివేయాలని వామ పక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. జాతీయ స్థాయి వామపక్ష పార్టీల పిలుపు మేరకు సోమవారం పట్టణంలో ఆయా పార్టీల నేతలు పాలస్తీనా సంఘీభావ ర్యాలీ నిర్వహించి ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు పి.శ్రీనివాసులు, పి.ఎల్.నరసింహులు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లానేత విశ్వనాథలు మాట్లాడుతూ ఇజ్రాయిల్ యుద్ధం ఆపాలంటూ, ఈ యుద్ధంలో వేల మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. మధ్య ప్రాచ్యంలో శాంతి స్థాపనకు అన్ని దేశాలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రామాంజులు, నేతలు బసిరెడ్డి, మాధవయ్య, రెడ్డెయ్య, సీపీఐ నేతలు రంగారెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

జగజ్జనని.. లోకపావని

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ ఆలయాల్లో కొలువైన అమ్మవార్లు సోమవారం రాత్రి పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణల్లో కొలువైన దేవతామూర్తులను దర్శించుకునేందుకు భక్తులు ఆలయాలకు తరలివచ్చారు. దీంతో అన్ని ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఈ సందర్భంగా భక్తులు జగజ్జనని.. లోకపావని మము కాపాడవమ్మా అంటూ ప్రణమిల్లారు. భక్తులకు ఆయా ఆలయ కమిటీ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కాగా రాజంపేట పట్టణంలోని అమ్మవారిశాలలో తోటోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ కన్యకాపరమేశ్వరీ మోహినీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

– సాక్షి, నెట్‌వర్క్



రైల్వేకోడూరు అర్బన్: గజలక్ష్మీగా కన్యకా పరమేశ్వరీ



రాయచోటి టౌన్: పార్వతీదేవి రూపంలో భద్రకాళీ



రాజంపేట టౌన్: మోహినీదేవి అలంకారంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి



సిద్దవటం: మాధవరం–1 గ్రామంలో మోహినీదేవిగా కన్యకా పరమేశ్వరీ



చిన్నమండెం: జగన్మోహినీదేవిగా వాసవీ మాత



రాజంపేట టౌన్: స్కంద మాత అలంకారంలో..



నందలూరు: మోహినీ అలంకారంలో వాసవీ మాత



పెనగలూరు: చండీదేవి అలంకారంలో అమ్మవారు



ఒంటిమిట్ట: మోహినీదేవిగా జగన్మాత



లక్కిరెడ్డిపల్లె: అలంకారంలో సర్వమంగళాదేవి



సుండుపల్లె: అమ్మవారిశాలలో ప్రత్యేక అలంకరణ



రాయచోటి టౌన్: రాజరాజేశ్వరీ దేవిగా చౌడేశ్వరీ



రామాపురం: పార్వతీదేవిగా దర్గామాతాజీ



రాజంపేట టౌన్: విశాలాక్షిదేవిగా వీరచౌడేశ్వరీదేవి

వలంటీర్ వ్యవస్థను కొనసాగించండి



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వలంటీర్లు

వీరబల్లి : మండలంలో గత ప్రభుత్వంలో వలంటీర్లుగా పనిచేసిన వారందరినీ తిరిగి కొనసాగించాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో చెప్పిన మాటను నిలబెట్టుకోవాలని సోమవాలం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వలంటీర్లు ధర్నా చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ప్రచారంలో వలంటరీ వ్యవస్థ కొనసాగుతుందని, రూ. 5 వేలు నుంచి రూ. 10 వేలు వరకు జీతం పెంచుతానని చెప్పి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా ఇంతవరకు వలంటీర్ వ్యవస్థను కొనసాగించలేదని వాపోయారు. వెంటనే వలంటీర్ వ్యవస్థను కొనసాగించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. అనంతరం ఎంపీడీఓ రామచంద్రారెడ్డికి వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్లు పాల్గొన్నారు.

సారా స్వాధీనం

రామసముద్రం: అరికెల పంచాయతీ దాసిరెడ్డిపల్లి సమీపంలో సారాబట్టిపై సోమవారం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తమ సిబ్బందితో కలసి దాడులు చేశారు. ఈదాడుల్లో 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 3 వేల లీటర్ల సారాను ధ్వంసం చేశారు.

స్పాట్ అడ్మిషన్లు

వైవీయూ : ప్రభుత్వ పురుషుల కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. బీఏ, బీకాం జనరల్, బీబీఏ, కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ, మ్యాథమ్యాటిక్స్ తదితర కోర్సుల్లో అడ్మిషన్లు చేస్తామన్నారు.